నేడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న బహుజన రాజ్యస్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ తెలిపారు. చిక్కడపల్లిలోని కల్లు కంపౌండ్‌లో జరిగే జయంతి వేడుకలకు బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ జాక్ కన్వీనర్ విశారదన్ మహారాజ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. పెద్ద ఎత్తున గౌడ కులస్తులు తరలి వచ్చి ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

31న బీసీల యుద్ధభేరి

కాచిగూడ: జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 31న తేదీన రవీంద్రభారతిలో చేపట్టనున్న బీసీల 'యుద్ధభేరి'పోస్టర్‌ను ఆదివారం బర్కత్‌పురలో కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ప్రధానకార్యదర్శి తంగెళ్లముడి నందగోపాల్, భరత్ గౌడ్, లలిత, కొల్లి నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

యువ జ్యోతి అసోసియేషన్ అధ్యక్షురాలిగా కల్వ సునీత

కవాడిగూడ: దోమలగూడలో జరిగిన యువజ్యోతి కాలనీ అసోసియేషన్ వార్షిక సమావేశంలో కల్వ సునీత అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సునీతను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సునీత మాట్లాడుతూ... యువజ్యోతి అసోసియేషన్‌కు మొదటిసారి మహిళను అధ్యక్షురాలుగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు. కాలనీ సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సతీష్, బస్తీకమిటీ నాయకులు కల్వ శంకర్, లక్ష్మణ్, మహేష్, నాగరాజు, సుజాత, రేణుక, వెంకటేష్, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అశోక్‌నగర్‌లోని కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సూర్య ప్రకాశ్ అన్నారు. డా.రమచంద్రన్ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో ఆదివారం కంటి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు స్థానికులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వైఆర్‌రెడ్డి, కార్యదర్శి పండిత్ డాక్టర్ అంజుబాబు, సంయుక్త కార్యదర్శి పద్మావతి, కోశాధికారి శివన్నాయుడు, సభ్యులు బి.సూర్యనారాయణ, అభయ్, హిమాయత్‌నగర్ సత్యసాయిసేవా సమితి జోన్ సభ్యులు పాల్గొన్నారు.

జైలు నుంచి విడుదలైన రెండోరోజే చోరీ

- 48గంటల్లోనే కేసును చేధించిన చిక్కడపల్లి పోలీసులు
- 25.8తులాల బంగారు ఆభరణాలు, రూ.23వేల నగదును స్వాధీనం



చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లో ఇద్దరు రిటైర్డ్ ఉద్యోగుల ఇంట్లో చోరీ జరిగిన 48 గంటల్లోనే చిక్కడపల్లి పోలీసులు కేసును చేధించారు. ఆదివారం సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పావల్లి కేసు వివరాలను వెల్లడించారు. కర్ణాటకు చెందిన బ్రూస్‌లీపై ఈనెల 13న చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇతడిపై 64 కేసులు ఉన్నాయని తెలిపారు. చిక్కడపల్లిలోని వివేక్‌నగర్‌లోని దిట్టకవి ఎన్‌క్లేవ్‌లో నివసించే రిటైర్డ్ ఉద్యోగులైన లక్ష్మీనారాయణ, రాజేశ్వరిల ఇంట్లో బంగారు ఆభరణాలను దొంగిలించారు. రాయుడు చైతన్యసాయికుమార్‌తో కలిసి ఆభరణాలను విక్రయించాలని పథకం పన్నారు. ఇతడిపై సైతం దాదాపు 67 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుందరయ్య పార్క్ వద్ద వారిని పట్టుకున్నారు. పోలీసులు తమ తీరులో విచారించడంతో చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. వారిని కోర్టులో హాజరు పరచి జ్యూడీషియల్ కస్టడీకి తరలించామని తెలిపారు. వారి వద్ద నుంచి 25.8తులాల బంగారు ఆభరణాలు, రూ.23వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రతి కాలనీలీ, అపార్ట్‌మెంట్‌లలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ కోరారు. పోలీసులు కేసును చేధించడంతో పీపుల్స్‌పార్క్ రెసిడెన్స్ అసోసియేషన్ సభ్యులు పోలీసులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాజునాయక్, డీఐ శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ కె.శిల్పావల్లి

వైభవంగా గంగ తెప్పోత్సవం

మత్స్యకారుల వృత్తిని తలపించేలా కళాకారుల ప్రదర్శనలు



మహాత్మానగర్ నుంచి తరలివెళ్తున్న సంఘం అధ్యక్షులు బిజ్జి కనకేష్‌కుమార్, గంగపుత్రులు



భోలక్‌పూర్ నుంచి తరలివెళ్తున్న గంగపుత్ర సంఘం నేతలు, మహిళా కమిటీ సభ్యులు



గంగ తెప్పోత్సవానికి హాజరైన గంగపుత్రులు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో హుస్సేన్‌సాగర్ తీరం వద్ద నిర్వహించిన గంగ తెప్పోత్సవానికి ఆదివారం మహాత్మానగర్ నుంచి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బిజ్జి కనకేష్‌కుమార్ స్థానికంగా ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ ర్యాలీలో మత్స్యకారుల వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నారు. జాల పందిరి, బోనాలు తదితర కళా ప్రదర్శనలతో ర్యాలీగా హుస్సేన్‌సాగర్ తీరానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాబురావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ భోలక్‌పూర్ హౌస్ నుంచి...

భోలక్‌పూర్ హౌస్ నుంచి గంగపుత్ర సంఘం భోలక్‌పూర్ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ గంగ తెప్పోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొండల్, మహిళా కమిటీ అధ్యక్షురాలు గంగ ఆధ్వర్యంలో బోనాలతో హుస్సేన్‌సాగర్ తీరం వద్ద ఉన్న గంగమ్మ దేవాలయానికి చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కవిత్వం కదిలించేదిగా ఉండాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖ కవి నిఖిలేశ్వర్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవిత్వం ఇతరులను కదిలించేది ఉండాలని ప్రముఖ కవి, విమర్శకులు నిఖిలేశ్వర్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో ప్రముఖ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి రచించిన ఆశయ (పదం నవల) అభద్రం(కథలు), సజీవం (కవిత్వం), ప్రజాగానం, సామాజిక ఉద్యమ గీతాలు, మీరే ప్రేరణ, మీరే సాధన (వ్యక్తిత్వ వికాసం), నేనిప్పుడు కమ్యూనిజానికి సొంతం (ఆరుద్ర) పుస్తకాలను ఆవిష్కరించారు.

◆ ముఖ్యఅతిథిగా పాల్గొన్న నిఖిలేశ్వర్ మాట్లాడుతూ... ఒకే వేదికపైన 6 పుస్తకాలను ఆవిష్కరించడం అరుదైన విషయమని అన్నారు. ఇది ఆయన ప్రతిభకు తార్కాణమని అన్నారు. అక్షరాల్లో జీవించిన వ్యక్తిగా ఇలాంటి పుస్తకాలు రాయడం గొప్ప పరిణామమని అన్నారు. కవితాక్షరాలు ఎనాటికైపా సజీవంగా ఉంటాయని అన్నారు. తన వ్యక్తిగత అనుభవాల నుంచి పుస్తకాలను రాయడం వల్ల పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. కలకాలం ఉండేది కవిత్వమని ఆ దిశగా కవిత్వం సాగాలని చెప్పారు.

◆ తెలంగాణ సాహితీ కార్యదర్శి కె.ఆనందాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పసునూరి రవీందర్, తెలంగాణ సాహితీ అకాడమీ కార్యదర్శి నమోజు బాలాచారి, నవతెలంగాణ సంపాదకులు రాంపల్లి రమేష్, ప్రముఖ కవి యాకుబ్, సినిమా విమర్శకులు రెంటాల జయదేవ్, డాక్టర్ సలీమ, మోహన కృష్ణా,శరత్, సుదర్శి పాల్గొన్నారు.

పురస్కారాలు ప్రతిభకు ప్రోత్సాహకాలు

చిక్కడపల్లి: పురస్కారాలు ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు బాధ్యతను పెంచుతాయని బీఆర్ఎస్ నాయకుడు ఎం.నాగేష్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సత్యం శివం సుందరం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాలు ప్రదానం చేశారు. రాజశేఖర్ గుప్తా, వీఎస్‌రావు, వీరభోగ వసంతరాయలు, వాణిరమణ, విక్కీ మాస్టర్ పాల్గొన్నారు.

'కంకపాద' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గుంటూరు లక్ష్మీనరసయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత్రి కళ్యాణి కుంజ రచించిన ఆదివాసీ కవిత సంపుటి 'కంకపాద'పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ కవి, విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మట్టి, అడవి నుంచి వచ్చి అడవి కావాలని పోరాటం చేస్తున్న కళ్యాణి కుంజకు అభినందనలని అన్నారు. కవి యాకుబ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు ఏకే ప్రభాకర్, డాక్టర్ పసునూరి రవీందర్, అనసూయ, నాగిల్ల రమేష్, డాక్టర్ తండా హరీష్‌గౌడ్, కుంజ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



బాగ్‌లింగంపల్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న వెంకటస్వామి మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి మాదిగ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న చలో పరేడ్ గ్రౌండ్ వికలాంగులు, చేయూత పెన్షన్‌దారుల మహాగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చేయూత పెన్షన్‌దారులకు రూ.2వేల నుంచి రూ.4వేల వరకు, వికలాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జన్‌పాల్ మహేష్‌కుమార్, ఉపాధ్యక్షుల గజ్జెల రాజశేఖర్ మాదిగ, దశరథ్, నర్సింహారాజు, ఎల్లయ్య మాదిగ, నగేష్, అనంతమ్మ, యాదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

రైలులో బంగారు ఆభరణాలు చోరీ

కాచిగూడ: చెంగల్‌పట్టు రైల్లో చైన్‌లాగీ ఇద్దరు మహిళల వద్ద నుంచి బంగారు గొలుసులు చోరీ చేసిన సంఘటనలో కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... హయత్‌నగర్‌కు చెందిన గాయత్రి (55) కాచిగూడకు రావడానికి తిరుపతిలో చెంగల్‌పట్టు రైలు ఎక్కింది. రైలు మల్యాల రైల్వే స్టేషన్ వద్దకు రాగానే గుర్తుతెలియని వ్యక్తులు రైలు చైన్ లాగి అందులో ప్రయాణిస్తున్న గాయత్రి మెడలోని 10గ్రాముల పుస్తేల తాడును దొంగిలించారు. అదే రైలులో ప్రయాణిస్తున్న ఎల్‌బీ నగర్‌కు చెందిన భవాని మెడలోని 2.5 తులాల బంగారు గొలుసును దొంగిలించారు. బాధితులు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం కర్నూల్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

చెక్‌బౌన్స్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

కాచిగూడ: స్నేహితుడిని నమ్మించి మోసం చేసిన నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన మాడిశెట్టి ధన్‌రాజ్‌కు నాంపల్లిలోని 9వ మెట్రోపాలిటన్ కోర్టు రెండు కేసుల్లో ఏడాది జైలు శిక్షతో పాటు రూ.36 లక్షలు పరిహారంగా చెల్లించాలని ఆదేశించిందని న్యాయవాది వి.నాగేశ్వర్‌రావు తెలిపారు. ధన్‌రాజ్ (56) తన స్నేహితుడైన కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన ఆర్.శ్రీనివాస్‌రావు వద్ద తక్కువ వ్యవధిలో తిరిగి చెల్లిస్తానని హామీ ఇచ్చి రూ.30 లక్షలు చేతి రుణం తీసుకున్నాడు. అందుకు రూ.20లక్షలు, రూ.10 లక్షలకు రెండు చెక్కులు ఇచ్చాడు. ఆ చెక్కులకు సంబంధించిన బ్యాంకులో తగినన్ని నిధులు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయి. కోర్టు ఆదేశాల మేరకు ధన్‌రాజ్‌పై కాచిగూడ పోలీసులు ఆగస్టు 2019లో కేసు నమోదు చేశారు. రెండు కేసుల్లో 12 నెలల జైలు శిక్షతో పాటు రూ.36 లక్షలు పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించిందని న్యాయవాది నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పుస్తకాలు రావడం శుభపరిణామం



ది మెడిసిన్ మెన్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, వైద్యరత్న డా. బుక్క మహేష్‌బాబు 'ది మెడిసిన్ మెన్'పుస్తకాన్ని రచించారు. శ్రీగురు ఆయుకేర్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయుర్వేద రంగంలో ఎంతో అనుభవంతో ఈ పుస్తకాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా రచించడం అభినందనీయమని అన్నారు. రుగ్వేదానికి అనుసంధానమైనది ఆయుర్వేదమని పేర్కొన్నారు. మొండి వ్యాధులు సైతం ఆయుర్వేదం ద్వారా నయం అవుతాయని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే ఇలాంటి పుస్తకాలు రావడం శుభపరిణామమని అన్నారు. హైకోర్టు న్యాయవాది ఎం. వెంకటేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, కెప్టెన్ ప్రశాంతి, జర్నలిస్ట్ సాయికుమార్ రెడ్డి, నాంబూరి సత్య ప్రసాద్ పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యం



మోడియం గీత, చిన్నారి

కాచిగూడ: బిడ్డతో కలిసి తల్లి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ ప్రాంతానికి చెందిన ముత్యాలరావు భార్య మోడియం గీత (30) తన 15 నెలల చిన్నారి ఎస్తేరుతో కలిసి శనివారం సాయంత్రం ఇంటి నుంచి ఇంట్లో భర్తకు చెప్పకుండా బయటకు వెళ్లింది. వివిధ ప్రాంతాల్లో, బంధు మిత్రుల ఇండ్లలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు



కంటి పరీక్షల విధానాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు, కార్పొరేటర్ అమృత

నల్లకుంట: కంటి జబ్బులను నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారం అవుతుందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. వివేకానంద కేంద్రం ఆధ్వర్యంలో శ్రీ మీనాక్షి ఐ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ వై.అమృతతో కలిసి శిబిరాన్ని సందర్శించిన రాంచందర్‌రావు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో 250 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారని వివేకానంద కేంద్రం ఇన్‌చార్జి రంగాచారి తెలిపారు. 68 మందికి కళ్లద్దాలు, అవసరమైన వారికి మందులు, ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేశామన్నారు. అధిక సంఖ్యలో జనం రావడంతో అందరికీ పరీక్షలు నిర్వహించలేకపోయామని తెలిపారు. వచ్చే నెల మరోసారి శిబిరం ఏర్పాటు చేసి మిగత వారికి కంటి పరీక్షలు చేయిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో కేంద్రం ప్రతినిధులు రంగాచారి, అప్పన రామలింగేశ్వరరావు, మధు, వేణు, 'శ్రీ మీనాక్షి ఐ ఆస్పత్రి' వైద్యులు, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

వినోబా భావే యాదిలో..

చిక్కడపల్లి: వినోబా భావేను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభ నిర్వహణలో వినోబా భావే యాదిలో.. ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. భూదాన్ ఉద్యమంతో అనేక మందికి భూములను అందించారని అన్నారు. ఈ కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి అధ్యక్షతన జరిగింది.

ఆర్.కృష్ణయ్య సత్యాగ్రహ దీక్షకు బీసీ సంఘాల మద్దతు

కాచిగూడ: స్థానిక సంస్థలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 25న సత్యాగ్రహ దీక్షను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న సత్యాగ్రహ దీక్షకు 15 బీసీ సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఆదివారం ఆయా బీసీ సంఘాల ప్రతినిధులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఆర్.కృష్ణయ్య 50 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో వేలాది హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు మంజూరు చేయించారని అన్నారు. అలాగే లక్షలాది మందికి స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌లు అమలు చేయించారని పేర్కొన్నారు. బీసీలు ఉన్నత చదువులు చదువుకుంటున్నారంటే అది కృష్ణయ్య చేసిన పోరాట ఫలితమేనని తెలిపారు. 1986లోనే పోరాడి బీసీలకు స్థానిక సంస్థలలో 34శాతం రిజర్వేషన్లు పెట్టించిన ఘనత ఆర్.కృష్ణయ్యదేనని గుర్తుచేశారు. ఇప్పుడు 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్న కృష్ణయ్యకు బీసీలందరూ మద్దతు ఇవ్వాలని వారు కోరారు.

తెలంగాణ జాగృతి యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్



అంబర్‌పేట: తెలంగాణ సమాజాన్ని జాగృతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ జాగృతి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచిగారి ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. ఇటీవల తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ఉపాధ్యాక్షుడిగా నియామక పత్రం అందుకున్నట్లు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి తరపునా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామన్నారు. సంస్థ ఇచ్చే పిలుపులను శక్తి వంచన లేకుండా విజయవంతం చేస్తామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు తెలంగాణకు అన్యాయం జరుగకుండా కృషి చేస్తామని తెలిపారు.

నందోత్సవం..!

నల్లకుంట: డివిజన్ పరిధిలోని ప్రశాంతినగర్ భక్తుల కృష్ణ భగవాన్ నామస్మరణలతో మార్మోగింది. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఆదివారం శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో నందోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రాధాకృష్ణులను ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి వరకు భక్తులతో మురళి సంకీర్తన రూపం (భజన) నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కుసుమ హరనాథ ఆశ్రమం కమిటీ కార్యవర్గం, ప్రతినిధులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.





హారతి ఇస్తున్న అర్చకస్వామి, రాధాకృష్ణుల మురళీసంకీర్తన చేస్తున్న భక్తులు

జనగామ జిల్లాకు పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

కాచిగూడ: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నింబోలిఅడ్డలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాపన్న చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని పిలుపునిచ్చారు. పాపన్నగౌడ్ జీవిత చరిత్రను రేపటి తరానికి అందించేందుకు విద్యార్థుల పాఠ్యాంశాల్లో పొందుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, భూషణ్ భాస్కర్, ముత్యాల్‌రావు, ప్రశాంత్ నిమ్‌కర్, సత్యపాల్ సింగ్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన బీసీ నాయకులు

కాచిగూడ: ఆల్ ఇండియా ఓబీసీ జాతీయ సెమినార్‌లో పాల్గొనడానికి ఆదివారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ నేతృత్వంలో ఆదివారం బీసీ నేతలు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నీలం వెంకటేష్ మాట్లాడుతూ... ఢిల్లీలో వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అధినేతలను కలిసి 42శాతం బీసీ రిజర్వేషన్ల అమలు కోసం పోరాడాతామని అన్నారు. చట్టపరంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

అమ్మవారి చల్లనిచూపు ప్రజలపై ఉండాలి



లింగంపల్లి మహంకాళిని దర్శించుకున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: లింగంపల్లిలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో దుర్గాభవానీ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠాపన జరిగింది. ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి చల్లనిచూపు ప్రజలపై ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉమారాణి, నాయకులు రమేష్ యాదవ్, అరవింద్, సూర్యప్రకాష్ సింగ్, బల్వీర్, వినోద్‌యాదవ్, చిట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం గౌడ, గీత కార్మికుల పొట్టకొడుతోంది'



వివేక్‌నగర్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న గౌడ సంక్షేమ సంఘం సభ్యులు

చిక్కడపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద గౌడ కులస్తులు, గీత కార్మికుల పొట్టకొడుతోందని గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బంటారం యాదగిరిగౌడ్ ఆరోపించారు. ఆదివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో బహుజన రాజ్య స్థాపకుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదగిరిగౌడ్ మాట్లాడుతూ... మూసేసిన కల్లు దుకాణాలను ప్రభుత్వం వెంటనే తెరిపించాలన్నారు. గౌడ కులస్తులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు శంకర్‌గౌడ్, చెన్నయ్య, సుబ్బారావు, చిన్నా, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవ. ప్రకాష్ గంటెల మృతి తీరని లోటు



రెవ.ప్రకాష్ గంటెలకు నివాళులర్పిస్తున్న క్రైస్తవ మత ప్రబోధకులు

ముషీరాబాద్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న క్రైస్తవ థియలాజికల్ స్పీకర్, బైబిల్ ప్రసంగీకులు ప్రకాష్ గంటెల శనివారం చికిత్స పొందుతూ మృతిచెందారు. వారి పార్థీవదేహాన్ని గోల్కొండ క్రాస్‌రోడ్‌లోని ఎంబీ చర్చిలో సందర్శనార్థం ఉంచారు. దైవ సేవకురాలు సిస్టర్ జాయ్ చెరియన్ ప్రార్థన చేసి ఆదరణ కూడికను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మృతదేహాన్ని దీపక్ జాన్ పూలమాలతో గౌరవించారు. మరణ పునరుద్ధాన సువార్త ప్రకటిస్తూ క్రైస్తవ భక్తి గీతాలు పాడుతూ అంతిమయాత్ర చర్చి నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ బస్‌భవన్ వరకు సాగింది. అనంతరం పార్థీవ దేహాన్ని గుంటూరులోని స్వగ్రామానికి తరలించారు. భూస్థాపన కోసం బయలుదేరారు. నివాళులు అర్పించిన వారిలో మైఖేల్, జార్జ్, ఫ్రాంక్లీన్, సామ్సన్, టోనీ, జవహర్, కెన్నెడీ, బెన్నీ, ఫ్రేజర్, నవీన్, డి న్ను, సుజీవన్, హెన్రీ బ్రూస్, బెన్హర్ జక్కుల, కెన్నీ, నవీన్, త్యాగరాజు, అభిసోలమన్, సి.ఎ.డానియేల్, ఆడమ్స్, జెరుషలేము ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.